స్కెచ్

# వెన్నవంటి హృదయం

ఎన్. నరసింహులు

నా స్నేహితులందరూ నన్ను తమాషాకు "దురదృష్టవంతుడివి" అంటుంటారు. నా కెందుకో అది నిజమే ననిపిస్తుంది. కాకపోతే నాతోబాటు కాలేజీలో చేరిన వారికంతా చిత్తూరు టౌన్‌లోనే నిక్షేపం లాంటి రూములు దొరకడ మేమిటి, నేను మైలు దూరంలోనున్న గ్రీమ్స్ పేటకు వెతుక్కుంటూ వెళ్ళడ మేమిటి?

అక్కడ ఒక హోటల్‌లో ఒక గది నా కోసం కాచుకొని ఉంది. ఆ హోటల్ పూర్వకాలపు పూటకూళ్ళ ఇంటిని జ్ఞాపకం తెస్తుంది. చూడటానికి ఆకర్షణీయంగా ఉండదు. ఆ ఇంటి క్రిందిభాగంలో ఉన్న గదుల్లో దాని సొంతదారులే ఉంటున్నారు. పై అంతస్థులో మొత్తం మూడు గదులున్నాయ్. ఈ మధ్యనే ఎవరో ఒకాయన గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడట, అందువల్లనే ఆ గదినైనా నేను పొందగలిగాను.

నా గది పోగా మిగతా రెండు గదులున్నాయ్ కదా! ఒక గదిలో నేమో (ఇద్దరు) ఆలుమగలూ ఉంటున్నారు. ఆయన పేరు సుందరయ్యగారని ఏదో ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నారనీ అక్కడ చేరిన కొన్ని రోజుల్లో తెలుసుకున్నాను. మనిషి చూడటానికి బలిష్ఠంగా, సినిమాలో విలన్ లాగా ఉంటాడు కాని ఆకారాన్ని చూచి ఒక మనిషిని తూకం వెయ్యలేముగదా! ఆయన చాలా మెత్తన. అసలు చెప్పాలంటే ఆయనగారి సతీమణి సుబ్బమ్మ చాల ధాటీ మనిషి. మాట్లాడితే పిడుగులు కురిసినట్లు ఉంటుంది. పెళ్ళయి నాలుగైదు సంవత్సరాలు కావస్తున్నదట, ఇంకా వాళ్ళిద్దరూ, ఇద్దరుగానే ఉంటున్నారు.

నాకైతే ఆవిడనుచూస్తే మాతృత్వంపొందే యోగం ఆవిడకు లేదేమో ననిపిస్తుంది (దేవుడు నన్ను క్షమించు గాక!)

ఇకపోతే ఇంకా నగదిలో ఒక కుటుంబం ఉంటున్నది. వాళ్ళు ఎంత కాలంగా అక్కడ ఉన్నారో తెలీదు. ఆలూమగలతో బాటు ముగ్గురు పిల్లలున్నారు. మళ్ళీ ఇప్పుడు ఆమె గర్భిణిగా ఉంది. ఆవిడ భర్త బాలప్ప ఒక వర్కుషాపులో ఫిట్టరుగా పని చేస్తున్నాడు. ఇక ఆవిడ (లచ్చుమ్మ) యేవో బీడీ చుట్టుతుంది. వాళ్ళిద్దరి ఆదర్శాలతోనూ సంసారాన్ని ఒక రకంగా నెట్టుకొనిపోతున్నారు.

భోజనంకోసం అరమైలు వెళ్ళడం నచ్చక, ఆ హోటలులోనే నాలుగు మెతుకులు తిని కాలం వెళ్ళబుచ్చడానికి నిశ్చయించుకున్నాను. నెలకు ముప్పయి అంటే అంత ఎక్కువ డబ్బు ఏమీ కాదు. కాని భోజనం గురించి ఒకమాట– నోటిలో పడటమే ఆలస్యం పళ్ళతో రాళ్ళూ, రాళ్ళతో పళ్ళూ– యుద్ధం చేస్తాయి, అంతే.

నా గది అందంగా లేకపోయినా రెండు వైపులా కిటికీలుండటంవల్ల గాలి ధారాళంగా వస్తుంది. దానితోనే నేను సంతృప్తి పడతాను. సాయంత్రంపూట గనక డాబామైన ఎక్కి నిలుచుంటే నాలుగువైపులా సుందరమైన ప్రకృతిని చూడ సంతోషంతో హృదయం గంతులు వేస్తుంది. రోజంతా మండే ఎండలే అయినా అప్పుడు కాస్త ప్రాణానికి హాయనిపిస్తుంది.

నా స్నేహితుడొకడు గుంటూరులో కాలేజీలో చేరి చదువుకుంటున్నాడు. అప్పుడప్పుడు సెలవుల్లో వచ్చినపుడు నన్ను కలుసుకొని మాట్లాడి పోతుంటాడు. వాడు సర్కారు జిల్లాలను గురించి తెగ పొగడుతుంటాడు. అక్కడవాళ్ళలో నాగరికత బాగా పెరిగిందని, మన రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరుజిల్లాలో ఇంకా నాగరికత అభివృద్ధి కాలేదని చిత్తూరుని కించపఱచి మాట్లాడుతుంటాడు.

(తరువాయి 18 వ పేజీలో)

# వెన్నవంటి మనసు

(8 వ పేజీ తరువాయి)

'నేను తల ఊపి ఊరుకుంటానా?' బలేనాగరికత చూశావులేవోయ్, కేవలం మనిషియొక్క వేష భాషలు మారితే సరిపోతుందా? మనిషి బాహ్యపరిణామాలతో పాటు మనసు కూడా మారాలి హృదయం నిర్మలంగా లేనిదే ఎంత నాగరికత ప్రబలితే ఏం ప్రయోజనం.'' అని వేమన వేదాంతం మాట్లాడి మా చిత్తూరు పరువును నిలబెట్టే వాణ్ని, అప్పటికి సరాగు వాళ్ళు మానసికంగా మారనట్లూ మా చిత్తూరు వాళ్ళు మారినట్లునూ.

ఇంతకూ ఇది ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే ఆ సుబ్బమ్మ ఉంది చూశారూ, చాలా చక్కగా టాయిలెట్ అవుతుంది బలే చలాకీగా ఉంటుంది. మాటలైతే సినిమా డైలాగ్స్‌లాగా ఉంటాయ్. కాని ఆవిడ మనస్సు మంచిది కాదు. బండగుండె ఆవిడది!

లచ్చమ్మ విలువైన దుస్తులు ధరించకపోయినా ఉన్న సాదా గుడ్డల్నే ఎప్పటికప్పుడు ఉతికి వాడుకుంటుంది. తన భర్తకూ పిల్లకూ కూడా ఆవిడే గుడ్డలు ఉతికి ఆరవేస్తుంది. ఆవిడ భాష గ్రామాల్లో గ్రామాల్లో సామాన్యులు మాట్లాడే భాష. వేష భాషలు మెచ్చుకోతగ్గ తీరులో లేకపోవచ్చుకాని ఆవిడ మనస్సు చాలా సున్నితమైనది. కారుణ్యం సాంగిపోతలేని జాలిగుండె ఆవిడది.

ఇంతకూ సుబ్బమ్మనూ లచ్చక్కను గురించి ప్రస్తావించవలసిన అవసరం కలగడానికి కారణం, ఆ ఇంటిలోని ఒక కుక్క అంటే మీరు ఆశ్చర్యపోతారేమో! నేను అక్కడ ప్రవేశించి నప్పటినుంచీ ఆ కుక్కను అక్కడ రోజూ చూస్తున్నాను. అది లచ్చమ్మ ఇంటిది అని చెప్పారు ఆవిడ దాన్ని పిల్లగా ఉన్నప్పుడే తెచ్చి అప్పట్నించి పెంచుకుంటూ ఉందట.

ఆ కుక్క కొన్ని రోజుల క్రితమే ఐదారు పిల్లల్ని ఈనింది! పగలంతా అది తన కడుపు నింపుకోవడంకోసం ఊరులోకి వెళ్ళిపోవడం, ఈ కుక్క పిల్లలు "కుయ్ కుయ్'' మని అరుస్తుండం మామూలు అయిపోయింది. ఇంతకుముందే లచ్చమ్మ అంటే సుబ్బమ్మకు సరిపడదట. ఇప్పుడు ఈ కుక్క పిల్లల బెడద ఒకటి తోడు కల్లు త్రాగిన కోతి అయినట్లు ఆ కుక్కమీద సాకుతూ లచ్చమ్మను తిట్టడం మొదలు పెట్టింది.

రాత్రి ఏ ఎనిమిది గంటలకో గాని ఆ కుక్క రాదు. ఈ పిల్లలు అరవుమానవు. పాపం, సుబ్బమ్మకు నిద్రా భంగం. ఆవిడ ఎన్ని రోజులకంటూ ఊరుకుంటుంది కొన్ని రోజులు లచ్చమ్మను మరుగ్గా తిట్టుకుంటూ వచ్చి ఈ మధ్య ఆవిడను ముక్కుసూటిగా దెప్పిపొడవటం ప్రారంభించింది. లచ్చమ్మ దాని మాటలు విన్నా విననట్లు ఊరుకునేది.

ఒకరోజు మా కాలేజీలో ఏదో డ్రామా ఉండటంవల్ల అక్కణ్నించి బయలుదేరేటప్పటికే తొమ్మిది, ఇక గ్రీమ్స్‌పేట చేరేటప్పటికి తొమ్మిదిన్నర దాటి ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు.

నా గదిలోకి ప్రవేశించాను. బయట కుక్కపిల్లలు "కుయ్ కుయ్' మంటున్నాయ్. ఇంకా ఆ కుక్క రాలేదు కాబోలు ననుకున్నాను. నాకు ఏదీ చదవబుద్ధెయ్యక పోవడం వల్ల వెళ్ళి భోంచేసివచ్చి సరాసరి పండుకున్నాను నా దేహం అక్కడ ఉన్నా ఒక పదిహేను నిముషాల సేపు నా మనస్సు అనే కోతి ఎక్కడెక్కడో చుట్టి వచ్చింది.

సుబ్బమ్మగదిలో తటాలున లైటు వెలిగింది. ఏదో కొంప మునిగేటట్లే ఉంది అనుకున్నాను. ధడాలున సుబ్బమ్మగది తలుపులు తెరుచుకున్నయ్. ఏం జరుగుతుందో చూద్దాం అని నేను తలుపుతీసి చూస్తున్నాను. కుక్కపిల్లల ఏడుపు సుబ్బమ్మ సహనానికి అగ్ని పరీక్షలాగా ఇంకా ఎక్కువవుతూనే ఉన్నది. వెళ్ళి లచ్చమ్మ గది తలుపును ఒక్కసారి బలంగా బాదింది సుబ్బమ్మ. ఆ దెబ్బతో ఏదో పిడుగు పడినట్లు కలగని లేచి వుంటుంది లచ్చమ్మ. "ఏమేవ్'', గట్టిగా అరచింది సుబ్బమ్మ. నిద్రమత్తులో కళ్లు నలుపుకుంటూ వచ్చి గడియతీసింది లచ్చమ్మ. సుబ్బమ్మగారి ఉగ్రరూపం చూచి ఆవిడ గుండెలో రాయిపడి ఉండాలి.

"ఏమేవ్, మమ్మల్ని ఇక్కడ ఉండమంటావా? లేచి వెళ్ళిపొమ్మంటావా?" సుబ్బమ్మ గొంతు సింహం లాగా గర్జించింది. లచ్చమ్మ ఇంకా నిద్రపోంచి పూర్తిగా తేరుకోనట్లుంది. ఏమీ మాట్లాడలేదు.

"నిన్నే మాట్లాడిస్తుంట, ఏం నువ్వు మాత్రం బాడుగిస్తున్నావా ఏమిటి? మేం ఎరివి లికి ఉంటున్నామా?" మరోమారు ఆవిడ కింత ఉరిమింది.

అప్పటికి లచ్చమ్మ నిదానంగా జవాబు చెప్పింది." ఏం చేసేదమ్మా, ఆ కుక్క ఎక్కడ పోయిందో, ఇంకా వచ్చింది కాదు"

నీ కుక్కను నువ్వు నెత్తి కెత్తుకుని ఊరేగు. మేం వద్దనడం లేదు. కానీ రాత్రుల్లనాయి మమ్ము నిద్రపొమ్మంటావా మేల్కొనే ఉండి పొమ్మంటావా?" సుబ్బమ్మ అక్కసు కక్కుతూ, బుసలుకొడుతూ శక్తినంతా కూడగట్టుకొని వీలైనంత బిగ్గరగా మాట్లాడింది. కుక్కపిల్లల అరపు ఆవిడకు నిద్రాభంగం కలిగించి ఉంటే ఉండవచ్చుగాని ఆవిడ అరపుతో గ్రీమ్స్ పేటలో అందరూ త్రుళ్ళిపడి లేచి ఉంటారు.

లచ్చమకు నోరెత్తడానికే భయంగా ఉంది. చివరికి సుబ్బమ్మకు నోరు నొప్పి పుట్టింది, కాబోలు, "ఉన్న పిల్లల్నే పెంచలేక చస్తుంటే ఇంకా కొరతకు కుక్క ఒకటి, దాని పిల్లలొకటి కావాలి" ఎత్తిపొడుపుగా మాట్లాడి, పక్కన కసుక్కున ఉమ్మేసి తన గదిలోనికి వెళ్ళిపోయింది సుబ్బమ్మ.

ఆ తుఫాను అంతటితో నిలచిపోవడం ఎదో మంచికాలం అనుకు తలుపువేసి పడుకున్నాను. కొంత సేపట్లో కుక్కపిల్లల అరపు ఉన్నట్టుండి ఆగిపోయింది. ఇప్పటికైనా కుక్కవచ్చి ఎడిదిందేమోనని లైటు వేసి తలుపు తీశాను కుక్క రాలేదు, కాని నేను చూచిన ఆ సంఘటనను నా జీవితాంతం మరచిపోలేను. లచ్చమ్మ తన పాలిండ్ల నుండి పాలు పిదికి గుడ్డ పీలికతో తడిపి ఒక్కొక్క కుక్కపిల్ల నోటిలోనూ పిండుతూ ఉంది. ఆ కుక్కపిల్లలు తమ ప్రాణం లేచి రావడంతో అరుపు మానుకుంటున్నయ్

(ఆవిడ ప్రసవించి నెలరోజులు కావస్తుందనే విషయం చెప్పటం మరిచాను)

## మూగపిల్లలచే మాట్లాడించవచ్చు

(7 వ పేజి తరువాయి)

స్లావా కొర్సున్స్కయా వివరించిన పద్ధతిని వారుపయోగిస్తారు. చెవిటి-మూగ పిల్లలు తాముచేసే ప్రతి చర్యనూ మాటలలో చెప్పగలిగేట్లుగా వారు బోధిస్తారు. గాలిని పీల్చడం వదలడం లాంటి వ్యాయామాలు చేయించుతారు. మాట్లాడేటప్పుడు సరియైన ఉచ్చారణ రావడమనేది గాలిని పీల్చడం వదలడం మీద ఆధారపడి వుంటుంది. చెవిటి మూగ పిల్లలు గాలిని పీల్చడం వదలడమనేది వెంటనే నేర్చుకోలేరు. వారికి మాటలను నేర్పడంలో అద్దం కూడా సహాయపడుతుంది. విద్యార్థి అద్దము ముందు కూర్చుని సరియైన ఉచ్చారణను నేర్చుకుంటాడు. చెవిటి - మూగ పిల్లల పాఠశాలలకు ధ్వనేంద్రియ సంబంధమైన సాధనాలు చాలా ముఖ్యం.

ఆ పాఠశాలలకు, పాఠాలు చెప్పే గదులను తోడు, దుస్తులు తయారు చేసే పరిశ్రమ, వడ్రంగం, కమ్మరి పనిచేసే వర్కుషాపులు, ఫోటోగ్రాఫిక్ లేబరేటరీ మొదలైనవి అనుబంధాలుగా వుంటాయి. పాఠశాల విద్యాభ్యాసాన్ని పూర్తిగా చేసేసరికి చాలామంది చెవిటి - మూగవారు డ్రాఫ్ట్స్‌మన్‌గా తయారవుతారు. చిత్రకళలో ఆసక్తిగలవారు దానిని కూడా నేర్చుకుంటారు.

మామూలుగా సెకండరీ పాఠశాల విద్యాభ్యాసం 10 ఏళ్ళలో అవుతుంది. కాని వీరికి 12 సంవత్సరములు పడుతుంది. ఇతర పాఠశాలల్లో ఎస్. ఎస్. యల్. సి. విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లే ఈ విద్యార్థులకుకూడ ఇవ్వబడతాయి.

పట్టభద్రులైన చెవిటి - మూగవారికి జీవితంలో లభించే స్థానం ఏమిటి? చాలామందికి సాంకేతిక విద్య గడప బడుతుంది. ఆయా సాంకేతిక సంస్థలలో వారు పనిచేస్తారు.